'స్థానిక' ఎన్నికలపై ఉత్కంఠ



- ఎన్నికల నిర్వహణపై ఆశావహుల్లో అనుమానాలు
- ఎన్నికల ఓటరు జాబితా తయారీలో జిల్లా యంత్రాంగం
- ఇప్పటికే జీపీల వారిగా తుది ఓటరు జాబితా ఖరారు
- నేడు ఎంపీటీసీ, జడ్పీటీసీల ముసాయిదా ఓటర్ జాబితా ప్రచురణ
- ఈనెలలోనే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ప్రయత్నాలు
- రిజర్వేషన్లపై తేలని పంచాయతీ

రాష్ట్ర ప్రభుత్వం ఈనెలలోనే ఎన్నికలు నిర్వహిస్తుందని తుది ఓటరు జాబితా తయారుచేసి రెండోవారంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తుందని ప్రచారం సాగుతోంది. అయితే పల్లెల్లో ఈసారైన ఎన్నికలు జరుగుతాయా.. లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే పలుమార్లు ఎన్నికలు నిర్వహిస్తారనే హడావుడి జరుగగా నిర్వహించకుండా వాయిదా వేస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు కూడా జరుగుతాయా.. లేదా అనే అనుమానాలు చాలామందిలో కలుగుతోంది. ఎన్నికలు వస్తాయనే ప్రచారం జరుగుతున్నప్పుడల్లా ఆశావహులు ఓటర్లను ఆకర్షించేందుకు భారీ ఖర్చుచేస్తున్నారు.



కామారెడ్డి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల ఎన్నికలు నిర్వహిస్తారా లేక సర్పంచ్ ఎన్నికలకు వెళ్తారా అని ఉత్కంఠ ఆశావహుల్లో నెలకొంది. ప్రస్తుతం మాత్రం ముందుగా పార్టీ సింబల్ ఎన్నికలకే వెళ్లవచ్చనే ప్రచారం జరుగుతోంది. సర్పంచ్ ఎన్నికలకు ఆశావహులు చాలామంది ఉంటారు. వారిలో ఒకరికి టికెట్ ఇస్తే మిగితా ఆశావహులంతా రెబల్‌గా పోటీ చేయడమో లేదంటే పార్టీ మద్దతుదారుడిని ఓడగొట్టడానికో ప్రయత్నం చేస్తారు. తర్వాత దీనిప్రభావం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికపై పడుతుంది. అందుకే ముందు ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల ఎన్నికలు నిర్వహిస్తే ఆశావహులకు సర్పంచ్ టికెట్ మీదేనంటూ ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులను గెలిపించుకోవాలని నచ్చచెప్పుకునేందుకు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఆ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధిస్తే సర్పంచ్‌లను గెలిపించుకోవడం సులువు అవుతుందని అధికార పార్టీ ఆలోచిస్తోంది.

ఏర్పాట్లలో అధికార యంత్రాంగం

సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి గ్రామ పంచాయతీల వారిగా ఓటరు తుదిజాబితాను ఇదివరకే ప్రకటిం చారు. జిల్లాలో 532 గ్రామ పంచాయతీలు, 4656 వార్డులు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం ఓట్లు 6,39,730 ఉండగా పురుషులు 3,07,508, మహిళలు 3,35,209, ఇతరులవి 13 ఓట్లు ఉన్నాయి. గ్రామ పంచాయతీలలోనూ మహిళా ఓట్లే అధికంగా ఉండడం గమనార్హం. పోలింగ్ కేంద్రాలను సైతం గుర్తించారు. జిల్లాలోని పంచాయతీల పరిధిలో 4670 పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ఇక రిజర్వేషన్ల ప్రక్రియ చేపట్టాల్సి ఉంది. రిజర్వేషన్లపై బిల్లులు కూడా పాస్‌చేయడంతో ప్రభుత్వం ఎన్నికలకు సిద్ధమవుతున్నట్లు స్పష్టం అవుతోంది. ఇక జడ్పీటీసీ, ఎంపీటీసీ ఓట్ల డ్రాఫ్ట్ జాబితాను శనివారం ప్రకటించనున్నారు. 8న ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ, ఎంపీఓల ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీల మీటింగ్ ఏర్పాటు చేయనున్నారు. 8 నుంచి 10 వరకు ఓటరు జాబితాపై అభ్యంతరాలను స్వీకరించి పరిశీలించి అదేరోజు తుది ఓటరు జాబితాను గ్రామ పంచాయతీలలో ప్రదర్శించనున్నారు.

గ్రామాల్లో ఎన్నికల హడావుడి

ప్రభుత్వం స్థానిక ఎన్నికలను త్వరలో నిర్వహిస్తుందనే ప్రచారంతో గ్రామాల్లో రాజకీయ సందడి నెలకొంది. ఆశావహులు ఒక్కొక్కరుగా జనం మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇద్దరు, ముగ్గురు పోటీలో ఉంటే మీకు ఎంపీటీసీ, నాకు సర్పంచ్ అంటూ పదవులను పంచేసుకుంటున్నారు. ఈసారి రిజర్వేషన్‌లు కూడా మారే అవకాశం ఉండడంతో ఆశావహులు అంతా జనం బాటపట్టారు. పంచాయతీల ఓటరు జాబితా సిద్ధం కావడంతో ఓటరు జాబితాను ఆశావహులు సేకరించి ఓటర్లపై ఆరాతీస్తున్నారు. ఇక ఎంపీటీసీ, జడ్పీటీసీ జాబితాలపై ఆ స్థానాలకు పోటీచేసేవారు దృష్టిసారించారు. ఇలా పల్లెల్లో స్థానిక ఎన్నికల హడావుడి నెలకొంది.



బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులను బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేటీఆర్

తెలంగాణను బంగారు పళ్లెంలో పెట్టి కాంగ్రెస్‌కు అప్పగించాం

- అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలులో ప్రభుత్వం విఫలం
- 21నెలల్లోనే రూ.2.20లక్షల కోట్ల అప్పు చేసిన కాంగ్రెస్
- రాష్ట్రంలో ఉపఎన్నికలు రావడం ఖాయం
- బాన్సువాడలో పోచారానికి ఓటమి తప్పదు : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్

గజ్వేల్/బాన్సువాడటౌన్, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణను బంగారుపళ్లెంలో పెట్టి కాంగ్రెస్‌కు అప్పగించామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫాంహౌజ్‌లో కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వ ర్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలన చేత కాని కాంగ్రెస్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, కేవలం 21నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత వచ్చిందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలనపై దృష్టిపెట్టకుండా కేసీఆర్ పేరును పదేపదే ప్రస్తావిస్తున్నారని అన్నారు. గతప్రభుత్వం కేవలం రూ.2.80 లక్షల కోట్ల అప్పు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం 21నెలల్లోనే 2.20లక్షల అప్పు చేసిందని, ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని అమలు చేయలేదన్నారు. యూరియా సంక్షోభం వెనుక రాష్ట్రప్రభుత్వం కుట్ర ఉందని, ప్రభుత్వం యూరియా పట్ల అను సరిస్తున్న విధానంలో అనుమానాలు వస్తున్నాయన్నారు. వ్యవసాయరంగం, రైతుల పట్ల ప్రభుత్వానికి ఇంత దుర్మార్గమైన ఆలోచన ఉందన్నారు. రాష్ట్రంలో జరిగిన ఫిరాయింపులపై సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని, త్వరలో రాష్ట్రంలో ఉపఎన్నికలు రావడం ఖాయమన్నారు. బాన్సువాడలో ఉపఎన్నికలు రావడం ఖాయమని, సుప్రీంకోర్టు స్పీకర్‌కు స్పష్టమైన ఆదేశాలను ఇచ్చిందన్నారు. గడువులోగా స్పీకర్ నిర్ణయం తీసుకోని పక్షంలో మరోసారి సుప్రీంకోర్టుకు వెళ్తామని, న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. బాన్సువాడలో వచ్చే ఉపఎన్నికల్లో పోచారం ఓడిపోవడం ఖా యమని, సుదీర్ఘ రాజకీయ జీవితం తర్వాత పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఏ పార్టీలో ఉన్నాడో చెప్పుకోలేని దయనీయ స్థితిలో ఉన్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీటీసీలో ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యలమంచిలి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కోటగిరి వల్లేపల్లి శ్రీనివాస్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు నార్ల రత్నకుమార్, ఫాక్స్ వైస్ చైర్మన్ గజేందర్, మాజీ సర్పంచ్‌లు పార్టీలో చేరారు. వారితో రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి, మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎంపీ నామా నాగేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి తదితరులున్నారు.



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న సురేష్

ఉత్తమ ఉపాధ్యాయుడిగా సురేష్ రాథోడ్

సదాశివనగర్, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు కామారెడ్డి డెయిరీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సురేష్ రాథోడ్ ఎంపికయ్యారు. శుక్రవారం హైదారాబద్‌లోని శిల్పాకళా వేదికలో జరిగిన వేడుక సమావేశంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ఆయన అందుకున్నారు. సురేష్‌రాథోడ్ ఈ ఘనత సాధించడం కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు ఆనందం వ్యక్తంచేశారు. డెయిరీ కళాశాల కామారెడ్డి నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం వరుసగా నాల్గవ అసోసియేట్ డీన్ డాక్టర్ సురేష్ రాథోడ్ రికార్డును నెలకొల్పారన్నారు. యూనివర్సిటీ కులపతి డాక్టర్ జ్ఞానప్రకాష్ రిజిస్ట్రార్ డాక్టర్ శరత్‌చంద్ర అభినందనలు తెలిపారు.

వరద బాధితులకు

సీఎం మొండిచేయి

- నష్టపరిహారం ప్రకటించకపోవడం సిగ్గుచేటు
- మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

కామారెడ్డి,సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): వరద బాధితులకు సీఎం రేవంత్ రెడ్డి మొండిచేయి చూపారని మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ విమర్శించారు. జిల్లాలో వరదలతో ప్రజలు, రైతులు తీవ్రంగా నష్టపోయారని, సీఎంపై బాధితులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని పేర్కొన్నారు. సీఎం పర్యటన జిల్లా ప్రజలను నిరాశపర్చిందని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఒక ప్రకటనలో విడుదల చేశారు. సీఎం పర్యటనలో ప్రసంగం తప్ప బాధితులకు రూపాయి కూడా ప్రకటించడం లేదని పేర్కొన్నారు. వరదలతో నష్టపోయిన రైతులు, వరద బాధితులను పరామర్శించి సీఎం ప్రచారం చేయించుకున్నారే తప్ప బాధితులకు ఎలాంటి ఒరిగిందేమీ లేదని తెలిపారు. జీఆర్ కాలనీ, కౌండిన్యకాలనీ, బతుకమ్మకుంట కాలనీలలో వరదలకు ఇళ్లు దెబ్బతిన్నాయని బాధితులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ఒక్కో ఇంటికి రూ.లక్ష నష్టపరిహారం ఇవ్వాలని, వరదల్లో మృతిచెందిన వారికి రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని బీఆర్ఎస్ ఇప్పటికే డిమాండ్ చేసిందని తెలిపారు. ఇసుక మేటలు వేసిన రైతులకు ఎకరానికి రూ.50వేలు పంటనష్టం, నష్టపోయిన ఎకరానికి రూ.25 వేల చొప్పున ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరామని పేర్కొన్నారు. మృతిచెందిన కుటుంబాలకు తూతూమంత్రంగా రూ.5లక్షలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, మున్సిపల్ రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని, వీటికి శాశ్వత పనులు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు.

15 అడుగుల మట్టి గణేషుడికి

ప్రత్యేక పూజలు



ఎల్లారెడ్డిలోని 15 అడుగుల ఎత్తులో మట్టి గణపతి

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణం కేంద్రంలోని హిందూ యువ సేన యూత్ ఆధ్వర్యంలో 15 అడుగుల ఎత్తైన భారీ మట్టి గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పట్టణంలో ఈ విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జిల్లాలోనే అత్యంత ఎత్తైన మట్టి వినాయకుడిగా గుర్తింపు పొందిన ఈ విగ్రహం, పర్యావరణ సంరక్షణకు చిహ్నంగా నిలుస్తోంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ బదులుగా, పర్యావరణ హితమైన మట్టితో గణేష్ విగ్రహాన్ని రూపొందించినట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం వినాయడికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం, భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో హిందూ యువసేన సభ్యులు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు, పట్టణ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

బాన్సువాడలో హీటెక్కుతున్న రాజకీయం 7

పంట నష్టపోయిన రైతులను

ప్రభుత్వం ఆదుకుంటుంది

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు



వరదలతో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

మద్నూర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, నష్టపరిహారం అందించి ఆదుకుంటుందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు. శుక్రవా రం ఎమ్మెల్యే ఉమ్మడి మద్నూర్ మండలంలోని గోజే గావ్, సోనాల, తడిహిపర్గా, లింబూర్ గ్రామాల్లో పర్యటించి, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరదలు దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని నష్టపరిహారం అందిస్తామని అన్నారు. వ్యవసాయ అధికారుల ప్రాథమిక సమాచారం మేరకు 6వేల ఎకరాల పంటలు నష్టపోయినట్లు ప్రభుత్వానికి నివేది క అందిందని, పంట పొలాల్లో వర్ష పు నీరు ఉండటంతో పూర్తిగా సర్వే కాలేదని చెప్పారు. వీలైనంత త్వరలో సర్వే పూర్తిచేయించి ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం అందేలా చూస్తానన్నారు. ఎమ్మెల్యేతోపాటు సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్‌పటేల్, మాజీ ఎంపీపీ ప్రజ్ఞకుమార్, ఆలయ కమిటీ చైర్మన్ రామ్ పటేల్, మాజీ సర్పంచ్ విట్టల్ గురూజీ, మాజీ ఎంపీటీసీ దీన్‌దయాల్, కొండా గంగాధర్, నాయకులు హనుమాన్లు స్వామి, గజానంద్ దేశాయి ఉన్నారు.



స్వామివారి మూలవిరాట్



అనంత పద్మనాభ స్వామి ఆలయం

నేడు అనంత చతుర్దశి వేడుకలు

- ముస్తాబైనా పద్మనాభస్వామి ఆలయం


భిక్కనూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలకేంద్రంలోని పోస్టాఫీసు సమీపంలో గల అనంత పద్మనాభ స్వామి ఆలయం అనంత చతుర్దశి వేడుకలకు ముస్తాబైంది. చాలాఅరుదుగా ఉండే ఈ అనంత పద్మనాభ స్వామి ఆలయంలో ప్రతి సంవత్సరం అనంత చతుర్దశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారికి ఆలయ అర్చకులు వెంకటేశ్వర శర్మ, జయప్రకాష్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు కోటి వత్తులను వెలిగించి మొక్కులు తీర్చుకోనున్నారు. ఈ అనంత చతుర్దశి వేడుకలను పురస్కరించుకుని స్వామివారిని దర్శించుకోవడాని కి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతో పాటుగా కరీంనగర్, మెదక్ జిల్లాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలిరానున్నారు. భక్తులకు ఎలా ంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.



ధర్మశాల వద్ద శోభాయాత్రను ప్రారంభిస్తున్న కలెక్టర్



నిమజ్జనానికి తీసుకువచ్చిన వినాయకుడు



జిల్లాకేంద్రంలోని వినాయక శోభాయాత్ర రూట్‌మ్యాప్

గంగమ్మ ఒడికి గణనాథులు

- కామారెడ్డి జిల్లాకేంద్రంలో ప్రారంభమైన వినాయక నిమజ్జన శోభాయాత్ర
- గంగకు తరలుతున్న గణనాథులు
- భాగ్యనగరాన్ని తలపించేలా శోభాయాత్ర
- నిమజ్జనానికి పోలీసుల భారీ బందోబస్తు
- భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు
- వీడియో,డ్రోన్ కెమెరాల పర్యవేక్షణలో శోభాయాత్ర

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): నవరాత్రులు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న వినాయకుడు శనివారం గంగమ్మ ఒడికి చేరాడు. జిల్లాలోని పలు మండలాల్లో పెద్దఎత్తున శోభాయాత్రలు, గణేష్ నిమజ్జన కార్యక్రమాలు జరిగాయి. కామారెడ్డి జిల్లాకేంద్రంలో అట్టహాసంగా వినాయకుని శోభాయాత్ర శుక్రవారం రాత్రి ప్రారంభమైంది. భాగ్యనగర్‌ను తలపించేలా కామారెడ్డిలో వినాయకుని శోభాయాత్రను విశ్వహిందుపరిషత్, గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. శోభాయాత్రను కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. జై భోలో గణేష్ మహరాజ్ కీ జై, గణపతి బోప్పా మోరియా అంటూ సిరిసిల్లా రోడ్డులోని ధర్మశాల నుంచి భక్తుల జయజయ ధ్వనులతో డప్పు చప్పుళ్లు, కళాకారుల నృత్యాలు, పాటలకు అనుగుణంగా యువకులు చిందులు వేస్తూ శోభాయాత్రను ప్రారంభించారు. మహిళలు శోభాయాత్రకు ఎదురొచ్చి మంగళహారతులు పట్టారు. పిల్లల కేరింతలు, భక్తజన సందోహల మధ్య గణనాథులు నిమజ్జనానికి తరలాయి. నవరాత్రులు ముగించుకొని పదో రోజు ఘనంగా భక్తుల నుంచి విశేషా పూజలందుకొన్న గణనాథుల శోభాయాత్ర అట్టహాసంగా ప్రారంభమైంది. మండపాల్లో పూజలందుకున్న గణపయ్యాలు అందంగా అలంకరించిన వాహనాల పై కొలువుదీరారు. రంగురంగుల విద్యుత్ దీపాలు, అందంగా అలంకరించిన పూలతో దేదీప్యమానంగా వెలుగొందుతున్న రథయాత్రపై ఆసీనులైన గణనాథులు భక్తుల మధ్య ముందుకు కదిలాయి. భారీ పోలీసు బందోబస్తు మధ్య శోభాయాత్ర ప్రారంభమైంది.

జనసంద్రంగా కామారెడ్డి

గణేష్ నిమజ్జనోత్సవానికి కామారెడ్డిలోని రోడ్లన్నీ జనసంద్రంగా మారాయి. శోభాయాత్ర జరిగే వీధులు సిరిసిల్లా రోడ్డు, స్టేషన్ రోడ్డు, సుభాష్ రోడ్డు, తిలక్ రోడ్డు, జేపీఎన్ రోడ్డు, మాయ బజార్, వేణుగోపాల్‌స్వామి రోడ్డు,పెద్ద బజార్ రోడ్లన్నీ భక్తులతో కిక్కిరిశాయి. శోభాయాత్రకు ప్రత్యేక ఆకర్షణగా ఉండే విధంగా గణేష్ మండపాల నిర్వహకులు వివిధ అలంకరణలతో దేదీప్యమానంగా, రమణీయంగా వెలుగొందే రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణలతోపాటు పూలతో అలంకరణ చేసిన రథాలను మండపాల నిర్వాహకులు పోటాపోటీగా తీర్చిదిద్దారు. శోభాయాత్రను తిలకించేందుకు కామారెడ్డి ప్రజలే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు, భక్తులు పెద్దఎత్తున (మిగతా 8వ పేజీలో..)



టెక్రియాల్ చెరువు వద్ద నిమజ్జనానికి ఏర్పాట్లు



బందోబస్తుపై అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ

శోభాయాత్రకు పకడ్బందీ ఏర్పాట్లు



పసుపు వాగు వద్ద నిమజ్జన ప్రదేశాన్ని సుందరంగా అలంకరించిన దృశ్యం



నిమజ్జన ఏర్పాట్ల దృశ్యం



విద్యుత్ దీపాలను అలంకరించిన దృశ్యం

బోధన్,సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): 11రోజుల పాటు పూజలందుకున్న వినాయకుడిని సాగనంపేందుకు అధికారులు, మండప నిర్వాహకులు సిద్ధమయ్యారు. శనివారం బోధన్‌లో వినాయక నిమజ్జనోత్సవాన్ని కన్నుల పండువగా జరుపుకునేందుకు అటు అధికార యంత్రాంగం, ఇటు ఆయా మండపాల నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. ఆటపాటలతో డప్పు చప్పుళ్లతో శోభాయాత్ర మార్గాలు మారుమ్రోగనున్నాయి. శివాలయం నుండి ప్రారంభమయ్యే శోభాయాత్ర పట్టణంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్రగా పసుపు వాగుకు చేరుకుంటుంది. మధ్యలో గణపతుల బావి వద్ద వినాయకులను నిమజ్జనం చేస్తారు. పెద్ద గణపతులను పసుపు వాగు వద్ద నిమజ్జన ఏర్పాట్లను నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ కాలేజ్ గణేష్ బావితో పాటు పసుపు వాగును సుందరంగా అలంకరించారు. శనివారం ఉదయం పూజలు నిర్వహించిన అనంతరం నిమజ్జనోత్సవానికి గణపతులను తరలించేందుకు నిర్వాహకులు సిద్ధమయ్యారు.

● విస్తృత ఏర్పాట్లు

గణేష్ నిమజ్జనోత్సవాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించే సంబంధిత శాఖ అధికారులు విస్తృతమైన ఏర్పాట్లు చేశారు. నాలుగు రోజుల ముందు నుంచే పసుపు వాగును నిమజ్జనానికి సిద్ధం చేశారు. నిమజ్జన కార్యక్రమంలో అపశృతులు, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖతో పాటు మున్సిపల్, విద్యుత్ శాఖ సంబంధిత శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నిమజ్జన కార్యక్రమం విజయవంతం చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. పట్టణంలోని వాడవాడల్లో 11రోజుల పాటు పూజలందుకున్న వినాయకుడు నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా యంత్రాంగం పూర్తి ఏర్పాట్లు చేస్తుంది. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహనదారుల మళ్లింపు చేపడుతూ ప్రత్యేక ఏర్పాట్లను నిర్వహిస్తున్నారు.

నిమజ్జన ఏర్పాట్లు పూర్తి

నవీపేట : మండలంలోని యంచ గోదావరి వద్ద గణేష్ నిమజ్జనానికి సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. గోదావరి బ్రిడ్జిపై క్రేన్‌లను ఏర్పాటు చేయడంతో పాటు 50మంది గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. గోదావరి బ్రిడ్జిపైన లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు గోదావరి బ్రిడ్జి వద్ద తమ కేటాయించిన విధులలో శుక్రవారం చేరారు. ఇదిలా ఉండగా శుక్రవారం సాయంత్రం వరకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 80గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేయడం జరిగిందని తహసీల్దార్ వెంకట రమణ తెలిపారు.

ముప్కాల్ : ముప్కాల్, బాల్కొండ మండలాలలో ఆయా గ్రామాలలో 9 రోజులు పూజలందుకున్న గణనాథులు నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. ఘనంగా నిమజ్జనాలు నిర్వహించారు. బాల్కొండ కృష్ణవేణి పాఠశాలలో గణనాథుడిని పాఠశాల ఉపాధ్యాయునిలు కోలాటాలతో, దాండియ నృత్యాలతో చెరువులో నిమజ్జనం చేశారు.

కమ్మర్‌పల్లి :మండలంలోని కోనాపూర్‌లో శివసేనా యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద శుక్రవారం పూజారి ఉసికెల రవి ఆధ్వ ర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వినాయకమండప నిర్వాహకులు హెల్డివంశి, చిలివేరి వివేక్, వినయ్, వర్ధన్, కార్తిక్, సామ శేఖర్ పాల్గొన్నారు.

రెంజల్ : మండల కేంద్రంలో షాంబాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద శుక్రవారం రెంజల్ ఎస్ఐ చంద్రమోహన్ ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నప్రసాద కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతి ఒక్కరు భక్తిమార్గంలో గణనాథుడిని పూజించి శాంతియుత వాతావరణంలో నిమజ్జనం చేసుకోవాలన్నారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

రుద్రూరులో గణనాథుడికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న నిజామాబాద్ ఎమ్మెల్యే

రుద్రూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సార్వజనిక్ గణేష్ మండలి 75వ వజ్రోత్సవాలు సందర్భంగా ప్రతిష్ఠించిన గణనాథుడిని శుక్రవారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ దర్శించుకున్నారు. గణనాథునికి ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం రుద్రూరు మండల కేంద్రంలోని అంగడి బజార్‌లో శ్రీ లక్ష్మి గణపతి ఆలయంలో ప్రతిష్ఠించిన గణనాథుడి ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వీరి వెంట బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ ప్రశాంత్ గౌడ్, మురళి, కటికే రామ్‌రాజ్, స్థానిక గణేష్ మండలి సభ్యులు బచ్చు రాము, సంజీవ్ రెడ్డి తదితరులున్నారు.

యంచ గోదావరి బ్రిడ్జి వద్ద నిమజ్జన ఏర్పాట్లు పరిశీలించిన సీపీ

నవీపేట,సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి):మండలంలోని యంచ గోదావరి బ్రిడ్జి వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను గురువారం అర్ధరాత్రి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పరిశీలించారు. గణేష్ విగ్రహాల నిమజ్జనానికి సంబంధించి ట్రాఫిక్ నియంత్రణ, భద్రతపరంగా అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ప్రజలందరు పోలీసులకు సహకారాన్ని అందించాలని ఏదైన అత్యవసర పరిస్థితులలో 100 డయల్ నెంబర్‌కు కాల్ చేయాలని లేదా సమీపంలో ఉన్న పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు, బందోబస్తు సిబ్బంది పాల్గొన్నారు.

కర్ర గణపతిని దర్శించుకున్న ఎమ్మెల్యే



అంకాపూర్‌లో యజ్ఞం చేస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి దంపతులు

ఆర్మూర్, సెప్టెంబరు, 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాపూర్‌లో హిందూసేవా సమితి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన కర్ర గణపతిని శుక్రవారం ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం మండపం వద్ద జరిగిన యజ్ఞంలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంకాపూర్ గ్రామంలో మొట్టమొదటిసారి రోజ్‌వుడ్‌తో చేసిన కర్ర గణపతిని ప్రతిష్ఠించి పూజలు చేయడం హర్షనీయమన్నారు. భవిష్యత్తులో పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులనే ప్రతిష్ఠించి పూజలు చేయాలని కోరారు. ఇటీవల బీజేపీ జిల్లా కార్యదర్శిగా నియమితులైన పోల్కం వేణు శుక్రవారం ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డిని కలిసి సన్మానించారు. తనపై నమ్మకంతో పార్టీ బాధ్యత అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పార్టీ సూచనల మేరకు ప్రజా సమస్యలపై ఉద్యమిస్తామని పోల్కం వేణు అన్నారు.

మైనారిటీ నాయకుల అన్నదానం

బోధన్,సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని 18వ వార్డు అంబేద్కర్ నగర్, దళితవాడ, పాత బోధన్, ఎస్సీ కాలనీ తదితర ప్రాంతాల్లోని గణేష్ మండపాల వద్ద మైనారిటీ నాయకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ ఎంఐఎం అధ్యక్షులు మీర్ ఇలియాజ్ అలీ మండపాల వద్ద పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతాలు వేరైనా కొలిచే దైవం ఒక్కటేనని ఆయన పేర్కొన్నారు. హిందు, ముస్లింలు సోదరభావంతో మెలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండపాల నిర్వాహకులు, మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

బాలిక అదృశ్యం.. సుఖాంతం

బోధన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బోధన్ మండలం పెగడాపల్లి గ్రామానికి చెందిన ప్రణిత ఎడపల్లిలోని గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. బాలిక కనిపించడంలేదని తండ్రి గురువారం రాత్రి బోధన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బోధన్ పోలీసులు సీసీ పుటేజ్‌లు పరిశీలించి విచారణ చేపట్టారు. ఈ విషయంపై బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణను వివరణ కోరగా ప్రణితకు చదువు ఇష్టం లేకపోవడంతో తండ్రి అక్కడే మందలించి వదిలేశాడని, దీంతో బాలిక దీపక్ స్వీట్ హోమ్ వద్ద ఏడుస్తూ ఉందన్నారు. అక్కడే ఓ షోరూమ్‌లో పనిచేస్తున్న గంగవ్వ ఇక్కడ ఉండడం క్షేమం కాదని రుద్రూర్‌లోని తన ఇంటికి తీసుకెళ్లింది. తీరా ఉదయం తాను విధులు నిర్వహించే షోరూమ్ వద్ద వద్దకు తీసుకువచ్చింది. అక్కడ నుంచి బాలిక తండ్రి, కుటుంబసభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించారు. దీంతో పోలీసులు, తల్లిదండ్రులు దీపక్ స్వీట్ హోమ్ చౌరస్తాకు చేరుకోగానే బాలిక ప్రణితను తల్లిదండ్రులకు అప్పగించారు. తాను ఎటువంటి కిడ్నాప్ చేయలేదని, 13ఏళ్ల బాలికల రాత్రిపూట రోడ్డు మీద ఏడుస్తుండడం చూడలేకే తాను ఇంటికి తీసుకెళ్లాలని, స్వయంగా తానే ఇక్కడికి తీసుకువచ్చానని గంగవ్వ తెలిపింది. దీంతో బాలిక కిడ్నాప్ కలకలం కథ సుఖాంతమైంది. తల్లిదండ్రుల వద్దకు ప్రణిత సురక్షితంగా చేరుకుంది.

గుండెపోటుతో డోంగ్లి ఏఈవో మృతి

మద్నూర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : డోంగ్లి వ్యవసాయ విస్తీర్ణ అధికారిగా విధులు నిర్వహిస్తున్న బసవరాజ్ (34) గుండెనొప్పితో మృతి చెందినట్లు సిబ్బంది తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున ఛాతిలో నొప్పి రావడంతో బాన్సువాడ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మరణించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. గురువారం సాయంత్రం వరకు డ్యూటీలో భాగంగా డోంగ్లి పరిధిలో నష్టపోయిన పంటలు పరిశీలించాడని కుటుంబ సభ్యులు తెలుపగా, రాత్రి వ్యవసాయ సిబ్బందితో కలిసి పంట నష్టపరిహారంపై చర్చించినట్లు సిబ్బంది తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు ఆడపిల్లలున్నారు.

ఆటో అదుపుతప్పి ఒకరు..

ఏర్గట్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం ఆటో అదపుతప్పి చెట్టుకు ఢీకొని నిర్మల్ జిల్లా గాజులపేటకు చెందిన పోగుల సత్యనారాయణ(48) మృతిచెందాడు. ఎస్సై పడాల రాజేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తొర్తి బట్టాపూర్ శివారులో గల మూలమలుపు వద్ద ఆటో నియంత్రణ కోల్పోయి చెట్టుకు ఢీకొని ఆటో పంట పొలంలోకి దూసుకెళ్లగా సత్యనారాయణ అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు బిన్ను కూమార్ ఫిర్యాధు మేరకు కేసు నమోదు చేసుకొని మృతు దేహాన్ని ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమర్టంకు పంపినట్లు ఎస్సై పడాల రాజేశ్వర్ తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత..



ధరావత్ స్రవంతి

రాజంపేట,సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడితండా గ్రామంలో చికిత్సపొందుతూ వివాహిత మృతి చెందినట్లు ఎస్ఐ దత్తాద్రిగౌడ్ తెలిపారు. మండలంలోని గుడితాండకు చెందిన దరావత్ స్రవంతి(21), సురేష్‌లకు నాలుగు నెలల క్రితం వివాహం జరిగింది. కొద్దిరోజులుగా కుటుంబకలహా లు వల్ల ఇద్దరికి గొడవలు కావడంతో క్షణికావేశంలో ఈనెల 3న స్రవంతి పురుగుల మందు తాగింది. దీంతో భర్త సురేష్ చుట్టుపక్కల వారి సాయంతో చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఎల్లారెడ్డిపేట అశ్విని హాస్పిటల్‌కి తరలించారని తెలిపారు. హస్పిటల్లో చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మర ణించినట్లు తెలిపారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామా రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

పురుగులు పట్టిన ఐస్‌క్రీం విక్రయించిన వ్యక్తిపై కేసు

నవీపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దర్యాపూర్ తండాలో గురువారం పురుగులు, బూజు పట్టిన ఐస్‌క్రీం విక్రయించిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తిరుపతి తెలిపారు. ఎడపల్లి మండలం ఏఆర్‌పీ క్యాంప్‌కు చెందిన చాంద్‌పాషా అనే వ్యక్తి దర్యాపూర్ తండాలో పురుగులు, బూజు పట్టిన ఐస్‌క్రీం విక్రయించాడని ఎస్ఐ పేర్కొన్నారు. దర్యాపూర్ తండాకు చెందిన అంబర్ సింగ్ ఫిర్యాదు మేరకు సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేయడంతో పాటు ఫుడ్ సెఫ్టీ అధికారులకు సమాచారం అందించామని ఎస్ఐ తెలిపారు. గురువారం దర్యాపూర్ తండాలో పురుగులు పట్టిన ఐస్‌క్రీం తిని పలువురు పిల్లలు వాంతులు చేసుకున్న విషయం విదితమే

బాధిత కుటుంబానికి చేయుత

ఆర్మూర్, సెప్టెంబరు, 5(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం చేపూర్‌లో ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న మీనుగు నరేష్ కుటుంబానికి నాయక పోడ్ సంఘ సభ్యులు చేయుతనిచ్చారు. బాధిత కుటుంబానికి రూ. 40వేలు విరాళంతో పాటు 50 కిలోల బియ్యాన్ని శుక్రవారం అందజేశారు.

ఘనంగా మిలాద్ ఉన్‌నబీ వేడుకలు



కోటగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న మైనారిటీలు

కోటగిరి,సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): కోటగిరి, పోతంగల్ మండలాల్లో శుక్రవారం మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. కోటగిరి, పోతంగల్ మండలాల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మహమ్మద్ ప్రవక్త సర్వ మానవళి శాంతితో ఉండాలని సందేశం ఇచ్చినట్లు ముస్లిం సోదరులు గుర్తు చేశారు. మహమ్మద్ ప్రవక్త చూపిన బాటలోనే ప్రతి ఒక్కరు నడవాలని వారు పేర్కొన్నారు. మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హమీద్, మైనారిటీ నాయకులు జమీర్, జుబేర్, బాబు ఖాన్, మసూద్, ఇంతియాజ్, పోత ంగల్‌లో ఫిర్దోస్ ఖాన్, అమీర్, అవేజ్, సలీం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాను వినియోగించుకోవాలి

బోధన్,సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఉషోదయ కళాశాల డైరెక్టర్ సూర్యప్రకాష్ అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోధన్ పట్టణంలోని ఉషోదయ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 10వ తేదిన బుధవారం రోజున రాష్ట్ర ప్రభుత్వంచే నడిచే తెలంగాణ నైపుణ్యాల అభివృద్ధి సంస్థ టాస్క్ సౌజన్యంతో ఉద్యోగాలకై ప్రాంగణాల నియామకాలు నిర్వహిస్తున్నామన్నారు. ఉషోదయ డిగ్రీ కళాశాలలో నాటి దృక్పధానికి అనుగుణంగా విద్య ప్లస్ ఉద్యోగం కల్పనే లక్ష్యానికి అనుగుణంగా ప్రతి సంవత్సరం కళాశాల ప్రాంగణంలో ఉద్యోగాల కల్పనకు నియామకాలను నిర్వహిస్తుందన్నారు. ఉద్యోగాల కొరకు 2024-25లో ఉత్తీర్ణులైన బీఏ, బీకం, బీఎస్సీ, బీడీఏ, బీడీఎం, బీఎడ్, బీటెక్ విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఇంటర్వ్యూ మూడు దశలలో ఉంటుందని తెలిపారు. మిగత వివరాల కొరకు కళాశాల టాస్క్ ప్లేస్‌మెంట్ అధికారి దీప ఫోన్ నెంబర్ 8978616777ను సంప్రదించాలన్నారు. తమ పేరును ముందుగానే నమోదు చేసుకోవాలన్నారు. బోధన్, నిజామాబాద్, బాన్సువాడ, కామారెడ్డి, ఆర్మూర్ పరిసరా ప్రాంత విద్యార్థులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గంగాధర్, ఎం.హరికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ నాగరాజు, అధ్యాపకులు తదితరులున్నారు.

'పంట నష్టపరిహారాన్ని అందించాలి'



ఖండ్‌గావ్‌లో అధికారులతో మాట్లాడుతున్న సభ్యులు

బోధన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): బోధన్, సాలూర మండలాల్లో ఇటీవల కురిసిన భారీవర్షాలు, వరదల కారణంగా విపరీతంగా పంట నష్టం వాటిల్లిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఖండ్‌గావ్, బికినెల్లి, కల్దుర్కి, సిద్ధాపూర్ గ్రామాలలో రైతులను ఆయన కలిసి రైతుల్లో మనోధైర్యం నింపారు. ప్రభుత్వం ఎకరానికి 30వేల రూపాయల నష్టపరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఖండ్‌గావ్‌లో పంట నష్టపోయిన వివరాలను నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారిణిని కలిసి రైతులందరికి నష్ట పరిహారం అందేలా చూడాలని పేర్కొన్నారు. డిక్లరేషన్ కోరుతున్నారని రైతులు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్ రెడ్డి దృష్టికి తీసుకురాగా వెంటనే ఆయన జిల్లా కలెక్టర్‌కు ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో సోషల్ మీడియా ఇన్‌చార్జి కూరెళ్ల శ్రీధర్, మండల అధ్యక్షులు సిర్ప సుదర్శన్, ప్రధాన కార్యదర్శులు దొనకంటి లక్ష్మారెడ్డి, జంగం వెంకటేష్, మాజీ మండల అధ్యక్షులు మనోహర్, మాజీ ప్రధాన కార్యదర్శి జీలకర్రి ప్రవీణ్ పాల్గొన్నారు.

మహిళా సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ

ఆర్మూర్, సెప్టెంబరు, 5(ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల కేంద్రంలో మహిళ సంఘ భవన నిర్మాణానికి శుక్రవారం కాంగ్రెస్ నాయకులు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళ సంఘ భవనానికి రూ. 20 లక్షలు, స్థానిక పాఠశాల భవన నిర్మాణానికి రూ. 25 లక్షలు ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో విడిసి అధ్యక్షుడు బార్ల ముత్యం, ఏఎంసీ డైరెక్టర్ మల్లారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ముక్కెర విజయ్, విడిసి సభ్యులు సుమన్, నవనీత్, మల్లేష్, ఇందిరమ్మ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు, 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్దిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీ ముభారక్ చెక్కులను నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి పంపిణీ చేశారు. నిజామాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జక్రాన్‌పల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 50 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మీ , షాదీ ముబాకర్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఐడీసీఎంఎస్ చైర్మన్ ఎం. సాయిరెడి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, కాంగ్రెస్‌పార్టీ నిజామాబాద్ రూరల్ నాయకుడు సొప్పరి వినోద్, సింగిల్‌విండో చైర్మన్‌లు ఆర్మూర్ గంగారెడ్డి, నాగుల శ్రీనివాస్, కాటిపల్లి నర్సారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ గౌడ్, సోమ రాజేందర్, జితేందర్‌నాయక్, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవం

పెర్కిట్, సెప్టెంబరు, 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల దినోత్సవం పురస్కరించుఒని ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి నరేంద్ర పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. విద్య, మార్గదర్శకత్వం తో విద్యార్థుల అత్యుత్తమ కృషికి ఉపాధ్యాయుల పాత్ర అభినందనీయమని పాఠశాల యాజమన్యం ప్రసాద్, సాగర్ అన్నారు. ఈ సందర్భంగా భారతదేశ రెండవ రాష్టపతిగా డాక్టర్ సర్వేపలి రాధకృష్ణ స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛాలతో శాలువతో సన్మానించారు.

బోధన్ : బోధన్ పట్టణంలోని పాండుఫారంలో గల మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో శుక్రవారం ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులు ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠాలు బోధించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు, వ్యాసరచన, ఉపన్యాసం వంటి పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కే.పద్మజ మాట్లాడుతూ గురువు ప్రాధాన్యత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు అందరు క్రమశిక్షణతో మెలుగుతూ భవిష్యత్‌లో ఉన్నత స్థాయిలో స్థిరపడాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా మైనారిటీ గురుకులాల కోఆర్డినేర్ మహ్మద్ బషీర్, జిల్లా విజిలెన్స్ అధికారులు షేక్ హైమద్ జియా, హైమద్ హమీద్ ఉద్దీన్‌తో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్ : ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామానికి చెందిన ఎడ్ల సునీల్‌రావు ను స్థానిక గ్రామ దళిత (మాల) సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం శాలువ, మెమెంటోతో సన్మానించారు. స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయునిగా విధుల్లో చేరిన సునీల్‌రావు ఉన్నత విద్య చదువుకొని అంచెలంచెలుగా ఎదుగుతూ ఇటీవల గెజిటెడ్ హెచ్‌ఎం గా పదోన్నతి పొందారు. ప్రస్తుతం సునీల్‌రావు ఆర్మూర్‌లోని రాంమందిర్ స్కూల్‌లో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. తమ గ్రామానికి చెందిన తమ కులస్థుడు గెజిటెడ్ హెచ్‌ఎంగా పదోన్నతి పొందడం పట్ల మాల సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేస్తు ముందు మరిన్ని ఉన్నతమైన హోదల్లోకి రావాలని ఆకాంక్షించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


ఏర్గట్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పలు బాధిత కుటుంబాలను బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, పన్నాల నర్సారెడ్డి, గడ్డం జీవన్, బద్దం లింగారెడి పాల్గొన్నారు.

మెండోర : మండలంలోని ఇటీవల మృతి చెందిన పలు బాధిత కుటుంబాలను బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్‌కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఇటీవల ఐర్లాండ్‌లో గుండె పోటుతో మృతి చెందిన అన్వేష్ రెడ్డి కుటుంబ సభ్యులను, కోడిచర్ల గ్రామానికి చెందిన నూకల వెంకన్న ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు వరిగడ్డి రవి, శ్రీనివాస్, బడాల సాయిరెడ్డి, పటేల్, లింగన్న, తదితరులు ఉన్నారు.

కమ్మర్‌పల్లి : మండలంలోని హసాకొత్తర్‌లో బాల్కొండ నియోజికవర్గ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ శుక్రవారం పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. గ్రామానిక చెందిన సుధాకర్ సోదరి న్యాలకంటి లత ఇటీవల అనారోగ్యంతో మరణించగా కుటుంబసభ్యులను పరామర్శించిన ఆయన మృతురాలి ఇద్దరుకూతుళ్ల, కొడుకును చదివించడానికి తనవంతుగా సహకారం అందజేస్తానని హమీ ఇచ్చారు. ఆయన వెంట మార్కెట్ కమిటటి చైర్మన్ పాలెపు నర్సయ్య, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పడిగెల ప్రవీన్, ఏనుగు మనోహర్, శీకాంత్, వేముల గంగారెడ్డి, శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

వేల్పూర్ : మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం పలు బాధిత కుటుంబాలను బాల్కొడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. అంక్సాపూర్ గ్రామానికి చెందిన బబ్బూరి రమేష్ వల్ల తండ్రి నడ్పి మల్లయ్య, పచ్చల నడ్కుడ గ్రామానికి చెందిన పున్నంరెడ్డి వారి తండ్రి అంజయ్యలు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న సునీల్ రెడ్డి బాధితుల కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. ఈయన వెంట మండల పార్టీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్న హైకోర్టు న్యాయాధికారి



ఆలయంలో పూజలు చేస్తున్న హైకోర్టు న్యాయాధికారి

భీమ్‌గల్, సెప్టెంబరు, 5(ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రమైన లింబాద్రి గుట్టపై గల శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని హైకోర్టు న్యాయాధికారి ప్రవీణ్ కుమార్ కుటుంబ సమేతంగా, హైకోర్టు ఏజీపీ శాలిని శుక్రవారం దర్శించుకున్నారు. భీమ్‌గల్ వాస్తవ్యుడైన హైకోర్టు న్యాయాధికారికి ఆలయ పూజారులు, సర్వసమాజ్ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా స్వాగతం పలికారు. గర్భగుడిలో గల శ్రీ లక్ష్మీ నరసింహస్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయల పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి వారిని శాలువతో సన్మానించారు.

రేషన్‌షాపును ప్రారంభించిన మార్క్‌ఫెడ్ చైర్మన్

ఆర్మూర్ , సెప్టెంబరు, 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాపూర్‌లో రాజారాం నగర్ కాలనీలో శుక్రవారం నూతన రేషన్ షాపు (చౌకదరల దుకాణం)ను రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి ప్రారంభించారు. 63వ జాతీయ రహదారి పక్కన గల కాలనీవాసులు గతంలో రేషన్ సరుకులను గ్రామంలోని సొసైటీ కార్యాలయం నుంచి తీసుకునేవారు. ప్రజల ఇబ్బందులను గమనించి ప్రభుత్వం కాలనీలో రేషన్ దుకాణం బ్రాంచ్‌నీ ఏర్పాటు చేసిందని మార్క్‌ఫెడ్ ఛైర్మన్ మార గంగారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీచైర్మన్ మార చంద్రమోహన్, ఏఎంసీ డైరెక్టర్ అమృత్‌రావు, విడిసి అధ్యక్షుడు కుంట గంగారెడ్డి, కార్యదర్శి మురళి, మాజీ ఎంపీటీసీ ఎంసీ గంగారెడ్డి, నర్సయ్య, భూమేష్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలను పరిష్కరించే విధంగా పోరాటాలు'

ఆర్మూర్ టౌన్, సెప్టెంబరు, 5(ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల కార్మికులు సమస్యలు పరిష్కరించే విధంగా పోరాటాలు చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎల్ పద్మ కార్మికులకు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని కుమార్ నారాయణ్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాటాడారు. కార్యక్రమంలో టీయుసీఐ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం. ముత్తెన్న , ప్రధాన కార్యదర్శి ఆర్. రమేష్, ఉపాధ్యక్షులు బి. సత్తెమ్మ, కే. రాజేశ్వర్, ఏ. ప్రకాష్, కార్యదర్శి అర్వింద్, ఆర్. పుష్పలత, పద్మ, సాయిలు, లత తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్‌కో ఉత్పత్తులపై సదస్సు



సదస్సులో పాల్గొన్న రైతులు

ఏర్గట్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం ఇఫ్‌కో కంపెనీ ఆధ్వర్యంలో పిఏసిఎస్ చైర్మన్ బర్మ చిన్న నర్సయ్య అధ్యక్షతన ఇఫ్‌కో కంపెనీ ఉత్పత్తులపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఫ్‌కో కంపెనీ ఎస్ఎఫ్ఏ నితీన్ కంపెనీ నానో యూరియా, యానో డిఏపిలపై అవగాహన కల్పించి మాట్లాడుతూ రైతులు యూరియాకు బదులుగా నానో యూరియా లిక్విడ్ వాడాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి కొలిప్యాక ఉపేంధర్ రెడ్డి, సంఘ కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది, సంఘ పరిధిలోని రైతులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి ఫొటోగ్రాఫర్ల నూతన కార్యవర్గం

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు, 5(ఆంధ్రజ్యోతి): జక్రాన్‌పల్లి మండల ఫొటో గ్రాఫర్, వీడియో గ్రాఫర్ల నూతన కార్యవర్గ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. మండల ఫొటో గ్రాఫర్, వీడియో గ్రాఫర్ అధ్యక్షుడిగా ఎం. మహేందర్ (అర్గుల్), ఉపాధ్యక్షుడిగా కుమార్(తొర్లికొండ), సురేష్(జక్రాన్‌పల్లి), ప్రధాన కార్యదర్శులుగా నరేష్‌కుమార్(మునిపల్లి), శంకర్ (తొర్లికొండ), కార్యదర్శిగా రవి(జక్రాన్‌పల్లి)లను ఎన్నుకున్నారు.

డొంకేశ్వర్ ఎంపీవోగా ప్రవీణ్‌కుమార్ బాధ్యతలు

డొంకేశ్వర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): డొంకేశ్వర్ మండల ప్రజా పరిషత్ ఎంపీవోగా శుక్రవారం ప్రవీణ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఆయన ఇంతకు ముందు డొంకేశ్వర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఆయనకు ఇంచార్జి ఎంపీఓగా నియమితులయ్యారు. ఎంపీవోగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు ఎంపీడీవో లింగం, కార్యదర్శులు ఆయనను సన్మానించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



కల్యాణలక్ష్మి చెక్కులు అందుకుంటున్న లబ్ధిదారులు

డిచ్‌పల్లి, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 65 కళ్యాణలక్ష్మి చెక్కులను నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అందజేసినట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొలసాని శ్రీనివాస్, సీనియర్ నాయకులు డాక్టర్ షాదుల్లా తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇచ్చినమాట తప్పకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు సాఫీగా కొనసాగిస్తుందని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు అన్ని గ్రామాల్లో వంద శాతం మెజార్టీని కైవసం చేసుకుంటామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు చిన్నోళ్ల నర్సయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: మండలానికి చెందిన లబ్ధిదారులకు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి కల్యాణ లక్ష్మీ చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. మండలానికి చెందిన వివిధ గ్రామాలకు చెందిన 19 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉమ్మాజి నరేష్, రాజేశ్వర్‌గౌడ్, జాఫర్, బద్దం రాంచందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలకవర్గం ఆస్తుల జప్తునకు నోటీసులు

- సొసైటీ ననుంచి 13.10కోట్ల నిధులు రాబట్టేందుకు శ్రీముఖం
- సీఎంఆర్ ధాన్యంలో తమ ప్రమేయం ఏమి లేదంటున్న పాలకవర్గం
- రాజకీయ కక్షతోనే తప్పుడు ఆరోపణలు



ఎత్తొండ సహకార సంఘం



ఎత్తొండలో మూతబడిన పారా బాయిల్ రైస్‌మిల్

కోటగిరి, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎత్తొండ సహకార సంఘానికి రాజకీయ గ్రహణం వీడటం లేదు. అభివృద్ధిలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిచిన సహకార సంఘం పాలకవర్గాల తప్పిదాలతో సంఘం ప్రతిష్ట రోజురోజుకూ దిగజారుతోంది. సహకార సంఘానికి ఆరు నెలల క్రితం సహకార బ్యాంకు అధికారులు నోటీసులు జారీ చేస్తే మరోమారు కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది.

ఎత్తొండ సహకార సంఘ ప్రస్తుత పాలకవర్గానికి మాజీ చైర్మన్, మాజీ డైరెక్టర్‌తో పాటు సస్పెన్షన్‌కు గురైన విండో కార్యదర్శి ఆస్తుల జప్తునకు రెవెన్యూ అధికారులు 1864 రెవెన్యూ చట్టం 11 కింద తొలి విడత నోటీసులు జారీ చేశారు. సీఎంఆర్ ధాన్యం ప్రభుత్వానికి నిర్ణీత గడువులో చెల్లించకపోవడంతో గతంలో విచారణ జరిపిన అధికారులు రూ.13.10కోట్ల నిధులు దుర్వినియోగం అయినట్లు నిర్ధారించారు. ఈ నిధులను రికవరీ చేసేందుకు తహసీల్దార్ గంగాధర్ మాజీ చైర్మన్ అశోక్ పటేల్‌తో పాటు మాజీ డైరెక్టర్ కిషోర్, సస్పెన్షన్‌కు గురైన విండో కార్యదర్శి సంతోష్‌తో పాటు ప్రస్తుత పాలకవర్గంలో ఉన్న 11మంది సభ్యులకు 93.63లక్షల చొప్పున నిధుల రికవరీకి నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న పాలకవర్గ సభ్యులు తమకు ఈ అంశంలో ఎలాంటి ప్రమేయం లేదని రాజకీయ కక్షతో సంఘంపై అబాండాలు వేస్తూ సంఘ ప్రతిష్టను దెబ్బ తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సీఎంఆర్ ధాన్యంతోనే నష్టాల బాట..

ఎత్తొండ సహకార సంఘం నష్టాల బాటకు పలు కారణాలు ఉన్నప్పటికీ 2022-23 సీఎంఆర్ ధాన్యం కేటాయింపుల్లో రాజకీయ ప్రమేయం సంఘ నష్టాలకు దారి తీయడం ప్రధాన కారణంగా మారింది. సంఘానికి ఇతర ప్రాంతాల నుంచి సీఎంఆర్ ధాన్యం కేటాయించారు. కేటాయించిన ధాన్యం నాణ్యత లేకపోగా తడిసిపోయిన ధాన్యం సంఘానికి కేటాయించడంలో అప్పటి రాజకీయ ఒత్తిళ్ల ఫలితం సంఘం నష్టాల బాటలోకి వెళ్లింది. సీఎంఆర్ ధాన్యం ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉన్నప్పటికీ తడిసిపోయిన ధాన్యం మిల్లింగ్ చేయలేని పరిస్థితి తలెత్తింది. సుమారు 40వేల క్వింటాళ్ల ధాన్యం పనికి రాకుండా పోవడంతో ఆ భారం సంఘంపై పడింది. దీనికి తోడు సహకార సంఘంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. గోదాం నిర్మాణానికి 1.33కోట్లు, క్యాష్ క్రెడిట్ లోన్ రూ.1.70కోట్లు, రైస్ మిల్లులో సాటెక్స్ మిషన్ రూ.70లక్షలు, రైస్ మిల్లులో మరమ్మతులు రూ.17లక్షలు, సీసీ వర్క్‌కు రూ.15లక్షలు, ధర్మకాంటాకు రూ.30లక్షలు ఖర్చు చేసినట్లు గతంలో పాలకవర్గ సభ్యులు వెల్లడించారు. ఈ ఖర్చు చేసిన నిధులను సంఘం లాభాల్లోంచే ఖర్చు చేసినట్లు గతంలో పాలకవర్గ సభ్యులు వివరించారు. సంఘానికి ఖర్చు చేసిన అంశాలను అప్పట్లో 51సెక్షన్ ప్రకారం విచారణ జరిపిన అధికారులు పరిగణలోకి తీసుకోకపోవడం నష్టాలను మరింత రెట్టింపు చేసింది. సీఎంఆర్ ధాన్యానికి సుమారు రూ.9కోట్ల బకాయిలు ఉండగా అభివృద్ధి పనులకు చేపట్టిన నిధులను సైతం దుర్వినియోగం చేసినట్లు విచారణ జరిపిన అధికారులు నిర్ధారించడంతో సంఘ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిణామాలతో అప్పటి చైర్మన్ అశోక్ పటేల్ చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. రాజీనామా అనంతరం సహకార బ్యాంకు అధికారులు సైతం సంఘ సభ్యులకు నోటీసులు జారీ చేయడం గమనార్హం. కాగా, రెవెన్యూ అధికారులు ఆస్తుల జప్తు నోటీసులు జారీ చేయడంపై మాజీ చైర్మన్‌తో ప్రస్తుత పాలకవర్గ సభ్యులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సంఘం నష్టాల బాట పట్టడంలో తమ ప్రమేయం ఏమి లేదని చర్చించినట్లు సమాచారం.

అయ్యప్ప స్వామి ఆలయంలో ఓనం పండుగ



నవీపేట అయ్యప్ప ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నవీపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం ఓనం పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గణపతి హోమం, అన్నపూజ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వామికి వివిధ రకాల కూరగాయలు, అన్నంతో అలంకరించారు. అనంతరం ఆలయంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

భీమ్‌గల్ రూరల్, సెప్టెంబరు, 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జి ముత్యాల సునీల్ రెడ్డి శుక్రవారం పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. బడా భీమ్‌గల్ గ్రామానికి చెందిన కార్యకర్త రాగుల లింబాద్రికి ఇటీవల కంటి ఆపరేషన్ జరగడంతో ఆయనను అలాగే సికింద్రాపూర్ గ్రామ పంచాయితీ పరిధిలోని పెద్దమ్మకాడి తండాకు చెందిన కార్యకర్త లింబన్న భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో సునీల్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట స్వామి, పిట్ల శ్రీనివాస్, ధాకటి స్వామి, మోహన్, సురేష్, ముల్క అరుణ్, తదితరులున్నారు.

షాంబాజీ నగర్ కాలనీ ఏర్పాటు



షాంబాజీ నగర్ కాలనీ నామకరణం బోర్డును ప్రారంభిస్తున్న ఎస్సై చంద్రమోహన్

రెంజల్,సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): రెంజల్ మండల కేంద్రంలోని కొందరు కాలనీవాసులు సమిష్టిగా తమ కాలనీకి శుక్రవారం షాంబాజీ నగర్ కాలనీగా ఏర్పాటు చేసుకున్నారు. షాంబాజీ నగర్ కాలనీ ఏర్పాటు సూచిక బోర్డును రెంజల్ ఎస్ఐ చంద్రమోహన్ చేతుల మీదుగా ప్రారంభించారు. మండల కేంద్రంలో కొందరు కాలనీవాసులు తమ కాలనీకి షాంబాజీ నగర్ కాలనీగా ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీభాషిత పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవం



ఉపాధ్యాయులను దినోత్సవం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఆర్మూర్, సెప్టెంబరు, 5(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని శ్రీభాషిత పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ పోలపల్లి సుందర్ డాక్టర్ సర్వేపల్లి రాధకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధకృష్ణన్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు. అదే విధంగా విజయ్ హైస్కూల్‌లో ఉపాధ్యాయుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రాధకృష్ణన్ చిత్ర పటానికి కరస్పాండెంట్ కవిత దివాకర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాన్సువాడలో హీటెక్కుతున్న రాజకీయం

- పార్టీలు మారుతున్న ముఖ్య నాయకుల అనుచరులు, కార్యకర్తలు
- స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం పడే అవకాశం



కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరిన నాయకులు (ఫైల్)

బాన్సువాడ టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పార్టీలు మారుతున్న ప్రధాన నాయకులు, ముఖ్య నాయకుల అనుచరులు, కార్యకర్తలతో బాన్సువాడ రాజకీయాలు హీ టెక్కుతున్నాయి. సాధారణ ఎన్నికల ముందు కనిపించే పార్టీ మార్పుల ధోరణి స్థానిక సంస్థల ఎన్నికల ముందే కనబడుతోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వివిధ పార్టీలు తమ పట్టు నిలబెట్టుకునేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. ముఖ్యంగా బాన్సువాడలో ఆయా పార్టీలకు చెందిన కీలక నాయకుల అనుచరులు, బలమైన కార్యకర్తలు పార్టీలు మారుతున్నారు. ఈ మార్పులు కేవలం వ్యక్తికే పరిమితం కాకుండా తమతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలను, ఓటర్లను కూడా తీసుకెళ్లేలా ఉన్నాయి. ప్రస్తుతం నాయకుల పార్టీల మార్పులు స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

బాన్సువాడలో ఏం జరుగుతోంది..

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల ముందు నాయకుల పార్టీలు మారడంతో అసలు బాన్సువాడలో ఏం జరుగుతుందోనని చర్చలు జోరుగా సాగుతున్నాయి. బాన్సువాడ నియోజకవర్గంలో ఇటీవల కొంతమంది ముఖ్యనాయకుల అనుచరులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అదేవిధంగా మరో ముఖ్యనాయకుడి అనుచరుడు, కార్యకర్తలు సైతం పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకున్నారు. పేరొందిన ముఖ్యనాయకుల అనుచరులే పార్టీలు మారుతుండడంపై పార్టీల నాయకులు ఏ సమయంలో ఎటువైపుకు వెళ్తున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. తాజాగా మరికొంతమంది నాయకులు కూడా కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం...

పార్టీల మార్పులు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపనున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పార్టీ మారిన నాయకులు, వారి అనుచరులు తాము చేరిన కొత్త పార్టీ కోసం గట్టిగా పనిచేయడం, ఇతర పార్టీలకు గట్టి పోటీ ఇవ్వడం ఖాయమని సర్వత్రా చర్చలు కొనసాగుతున్నాయి. ఇది ఓట్ల చీలికకు, ఎన్నికల్లో అనూహ్య ఫలితాలకు దారితీసేందుకు అవకాశాలు లేకపోలేవు. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలు తమ బలాన్ని నిలుపుకోవడానికి, ప్రత్యర్థి పార్టీల నుంచి నాయకులను ఆకర్షించడానికి విస్తృత ప్రయత్నాలు చేస్తున్నాయి. రాబోయే రోజుల్లో బాన్సువాడ రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారనున్నాయని చెప్పవచ్చు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం



మోదీ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు



కమ్మర్‌పల్లిలో..

డొంకేశ్వర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): డొంకేశ్వర మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. వస్తువులపై జీఎస్టీని తగ్గించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ పాలభిషేకం చేశారు. నిత్యవసర సరుకులతో పాటు మరికొన్నిటికి జీఎస్టీ తగ్గించడం ద్వారా ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని బీజేపీ నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పోతుగంటి సురేందర్, సంజీవ్, హనుమంతు, సాగర్, లింగం, చిన్నయ్య, ముత్యం భోజన నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్ రూరల్: జీఎస్టీ ధరలు తగ్గించిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్ర పటానికి శుక్రవారం బాబాపూర్ గ్రామంలో బీజేపీ పార్టీ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు రవిందర్ మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో భారత ప్రభుత్వం జీఎస్టీ ధరలు తగ్గించడంతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. వ్యవసాయ రంగం అలాగే ఆటో మొబైల్, ఎలక్ట్రికల్, బీమా కంపెనీ, ఔషధాలు వంటి ధరల్లో జీఎస్టి తగ్గించడంతో మోడీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కిషన్, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, గంగాధర్, కొట్టాల అశోక్, ప్రేమ్‌చంద్, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోదీ పేద మధ్య తరగతి ప్రజల శ్రేయస్సు కోరుతూ వారికి ఇబ్బందికరంగా మారిన నిత్యవస్తువులు, విద్యార్థుల నోటుపుస్తకాలు, రైతులకు ఉపయోగపడే ఆటోమెబైల్ రంగం,పాల ఉత్పత్తులు, హెల్త్ ఇన్సూరెన్స్ తదితర సామాన్యుడికి ఉపయోగపడే వివిధ రకాల ఔషధాలపై జీఎస్టీని తగ్గిస్తు తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ ప్రధాని చిత్రపటానికి పాలాతో అభిషేకం చేసి పెదల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం స్థానిక భరత మాత విగ్రహంవద్ద రాష్ట్ర పార్టీ, బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మల్లికార్జున్ రెడ్డి ఆదేశాలమెరకు కమ్మర్‌పల్లి మండల బీజేపీ నాయకులు పిఎం నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బద్దం రమేష్ రెడ్డి, సీనియర్ నాయకులు రెంజర్ల గంగాధర్, మల్లేష్ యాదవ్, దర్పల్లి సతీష్, సున్నం మోహన్, బలరాం, కొత్తపల్లి గణేష్, లక్ష్మణ్, చంద్రమోహన్, పోల్కం పురుశోత్తం, మనికంఠ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన



సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గణపతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో కుంకుమార్చన పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కుంకుమార్చన పూజలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. వేద పండితులు వేదమంత్రోచ్చరణలతో కలశ, గణపతి, గౌరీ, పూజలు జరిపించి లక్ష్మి అష్టోత్తర శతనామాలతో మహిళలచే కుంకుమార్చన పూజలు చేయించారు. అనంతరం మహిళలు ముత్తైదువులకు వాయినాలు ఇచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మాశెట్టి లిఖిత్, రఘు, సాయికిరణ్, శివప్రసాద్, శ్రావణ్, బుక్కరాజు, సతీష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలను బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివా ళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విటల్, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, నగర అధ్యక్షుడు సిర్పరాజు, ఆదివాసి జిల్లా అధ్యక్షుడు డి.అంజయ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అండర్-15 బాలబాలికల చెస్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్-15 బాలబాలికల చెస్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లోగల అభ్యాస పాఠశాలలో శుక్రవారం ఈ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా డాక్టర్ రాజేందర్ సూరి నాయుడు హాజరై మాట్లాడారు. అనంతరం విజేతలకు బహుమతులను, ప్రశంసాపత్రాలను అందజేశారు. బాలుర విభాగంలో అభిజిత్, మొదటి విజేతగా నిలువగా శివానంద ద్వితీయ బహుమతిని గెలుపొందాడు. బాలికల విభాగంలో సహస్ర విజేతగా నిలువగా మనస్వి రన్నరప్‌గా నిలిచింది. వీరిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు అధ్యక్షుడు రమేష్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

ఇందల్వాయి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చాలీ చాలని జీతాలతో వెట్టి చాకిరీ చేస్తున్న పంచాయితీ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్యామ్ సంగ్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్మికులు మున్సిపల్ కార్మికులు 50వేల మంది పని చేస్తున్నారనీ వీరికి ఎటువంటి గుర్తింపు, పర్మినెంట్ లేదు ఈఎస్ఐ పీఎఫ్ సౌ కర్యం లేదన్నారు. కార్మికులు సాధించుకున్న జీతాలు 9500 ఇస్తున్నారనీ ఇప్పు డు అది కూడా కార్మికులు పోరాటాలు చేసి ఐక్య పోరాటాల ద్వారా సాధిం చుకోవడం జరిగిందన్నారు. ఈ నెల సెప్టెంబరు 7న ఐఎఫ్‌టియు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు హైదరాబాద్ లోనీ పుచ్చలపల్లి సుందరయ్య భవన్లో సదస్సు నిర్వహిస్తున్నామని పంచాయితీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కా ర్యక్రమంలో తెలంగాణ ఆదర్శ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జేపీ గంగాధర్, గ్రామపంచాయతీ కార్మికులు దుబ్బాక మోహన్, లక్ష్మణ్, గంగరాజం, రామయ్య, శివానందం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

మోపాల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సేవాభారతి, మాదవ స్మారక సేవా సమితి ఇందూరు ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. శుక్రవారం నగరంలోని బోర్గాం(పి)లో జరిగిన ఈ కార్యక్రమానికి సేవా భారతి జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య, సేవాభారతి తెలంగాణ ప్రాంత సంయోజకుడు వాసు అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాదవ సేవా సమితి అధ్యక్షుడు మర్రి కృష్ణారెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, స్థానిక నాయకులు నర్సారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గణేష్, నర్సయ్య, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

వినాయక సాగర్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్, సెప్టెంబరు, 5(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని వినాయక సాగర్ (గూండ్ల చెరువు), కొటార్మూర్ చెరువులను శుక్రవారం ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి పరిశీలించారు. శనివారం వినాయక నిమజ్జన కార్యక్రమానికి అధికారులు చేసిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలు తలెత్తకుండా చూస్తున్నారని అన్నారు. నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతీ ఒక్కరు సహకారం అందించాలన్నారు. గణేష్ మండలాల వారు తమ వినాయక విగ్రహాలను ముందుగానే నిమజ్జన కార్యక్రమానికి తరలించి రాత్రి 10 గంటల లోపు పూర్తి చేయాలని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి సూచించారు. యువకులు వినాయక శోభయాత్రలో అశ్లీల నృత్యాలు చేయవద్దని, మద్యం సేవించవద్దని హిందూ ధర్మాన్ని అపవిత్రం చేయకుండా చూడాలన్నారు. ఎమ్మెల్యే వెంట వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ



నాళేశ్వర్‌లో విశ్వబ్రాహ్మణ సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ నిర్వహిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

నవీపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్‌లో విశ్వబ్రాహ్మణ సంఘం భవనంతో పాటు మండలంలోని బినోలలో మున్నూరు కాపు సంఘం ఐరన్ రేకుల షెడ్డు నిర్మాణానికి శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్ రెడ్డి భూమిపూజ నిర్వహించారు. నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ నాళేశ్వర్‌లో విశ్వబ్రాహ్మణ సంఘం భవన నిర్మాణానికి 3.50 లక్షల రూపాయలు, బినోలలో మున్నూరు కాపు సంఘం ఐరన్ రేకుల షెడ్డు నిర్మాణం కోసం 3లక్షల రూపాయల నిధులను ఇటీవల మంజూరు చేశారు. అలాగే కోస్లీలో గోదావరి వరదలో నీట మునిగిన కోళ్ల ఫారంను పరిశీలించి యాజమాని హరీష్ కుమార్‌ను పరామర్శించారు. అంతకు ముందు మండలంలోని శాఖాపూర్‌లో బాధిత బీజేపీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు సరిన్, రాధ, శ్రీధర్, శ్రీకాంత్, రాజేందర్ గౌడ్, భూషణ్, ఆనంద్, కోరే గంగాధర్, నారాయణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

చింతలూర్, కలిగోట్‌లలో ఘనంగా తాతాయి పండుగ

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు, 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలూర్, కలిగోట్ గ్రామంలో శుక్రవారం తాతాయి పండుగను ఇరు గ్రామస్థులు భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. ఊరేగింపుగా వచ్చి తాతాయిలకు నైవేద్యాలు వేసి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పుష్కలంగా వర్షాలు కురువాలని, పంటలు పండాలని ప్రజలు ఆయురారోగ్యంగా ఉండాలని గ్రామస్థులు తాతాయిలకు పూజలు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న దుబాస్‌రాములు

కార్మికుల పోరాట ఫలితమే లేబర్ ఇన్సూరెన్స్ పెంపు

» భవన నిర్మాణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుబాస్‌రాములు

బాన్సువాడటౌన్, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల పోరాట ఫలితంగానే ప్రభుత్వం లేబర్ ఇన్సూరెన్స్ పెంచిందని భవన నిర్మాణ సంఘం జిల్లాప్రధాన కార్యదర్శి దుబాస్‌రాములు అన్నారు. శుక్రవారం సీపీఐ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడేళ్లుగా భవన నిర్మాణ కార్మికులకు లేబర్ ఇన్సూరెన్స్ డబ్బులు పెంచాలని అనేక ఉద్యమాలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, భవన నిర్మాణ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకపోవడంతో ప్రభుత్వం స్పందించి పరిహారం పెంచిందని అన్నారు. భవన నిర్మాణ కార్మికుడు సహజ మరణం పొందితే రూ. లక్ష 30వేలను ప్రస్తుతం 2లక్షలకు పెంచారని, ప్రమాదవశాత్తు కార్మికుడు మరణిస్తే ప్రస్తుతం ఇస్తున్న రూ.6లక్షల 30వేలను 10లక్షలకు పెంచారని తెలిపారు. ఇది భవన నిర్మాణ కార్మికులు సాధించిన విజయమన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, కార్మికశాఖ మంత్రులకు, నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో చెన్నంగారి సురేశ్, దర్శన్, సాయిబాబా, హన్మాండ్లు, కిష్టయ్య ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



అన్నాసాగర్‌లో ఉపాధ్యాయులుగా చిన్నారులు

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల పరిధిలోని అన్నాసాగర్ గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ దుర్గా మాట్లాడుతూ గురువులు దైవసమానులని, వారు అందించే విద్యఎంతోమంది జీవితాలలో వెలుగులు నింపుతుందని పేర్కొన్నారు. చిన్నారులు ఉపాధ్యాయుల వేశధారణలో ముస్తాబుకావడంతో చిన్నారుల తల్లిదండ్రులు సంబురపడ్డారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఆయా లక్ష్మీ, సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'నీటి విడుదలను ఆపండి'

పాల్వంచ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండలకేంద్రంలోని సూరం చెరువు తూము నుంచి అక్రమంగా కొందరు నీటిని విడుదల చేస్తున్నారని, వెంటనే తూము నుంచి నీటి విడుదలను అడ్డుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. శుక్రవారం రైతులు మాట్లాడుతూ కొందరు చెరువులో నీటిని తగ్గించాలనే ఉద్దేశంతో తూములను తెరిచి పెడుతున్నారని, దీంతో చెరువులోని నీరంతా ఖాళీ అయ్యే పరిస్థితి ఏర్పడిందని, అధికారులు స్పందించి తక్షణమే తూము నుంచి నీటి విడుతలను నిలిపి వేసి కారకులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి

కామారెడ్డిటౌన్,సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా టీపీసీసీ ప్రధానకార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో 25మంది ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పదని తెలిపారు. ఉపాధ్యాయ వృతి ఎంత ఉన్నతమైందని పేర్కొన్నారు. దేశానికి మంచి పౌరులను అందించేది కేవలం ఉపాధ్యాయుడేనని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్‌చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ,పీఆర్‌టీయూ ప్రెసిడెంట్ గోవర్ధన్, సీనియర్ ఉపాధ్యాయుడు గంగాకిషన్ పాల్గొన్నారు.

అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానాన్ని వెలిగించేది గురువే

మద్నూర్: అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానాన్ని వెలిగించేది గురువేనని బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గంగా కిషోర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తెలంగాణ గురుకుల బాలుర విద్యాలయం, జూనియర్ కళాశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో గురువుపాత్ర చాలా కీలకమైందని సమాజాన్ని చైతన్యపరిచేది గురువేనని గుర్తుచేశారు. విద్యార్థులు గురువులపట్ల ప్రేమను కలిగి విద్యార్థులు సూచించారు. అనంతరం విద్యార్థులు గురువులకు నమస్కరించి సన్మానంచేశారు. కార్యక్రమంలో పద్యకవి డా.బి.వెంకట్, అధ్యాపకులు రాము, నరహరి, సుమన్, గణేశ్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

బీర్కూర్‌లో ..

బీర్కూర్: బీర్కూర్ మండల కేంద్రంలోని బీసీ గురుకుల పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో తరగతి గదులకు వెళ్లి పాఠాలు బోధించారు. ఉపాధ్యాయుల వేషధారణలో విద్యార్థులు అందరిని అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల అందజేత

రాజంపేట,సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లాపూర్‌తండా, నడిమితండా విద్యార్థులకు హైదరాబాద్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్కూల్‌బ్యాగ్‌లు, నోట్‌బుక్స్ మిగితా సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ వరదలతో ప్రజలతోపాటు విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని వారికి తమవంతు సహకారం అందించామని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యూష, నిక్కి, శ్రీధర్, భీమాగౌడ్, సవిత, పాతిమా, సుందరి, సూర్యపాల్ తదితరులు పాల్గొన్నారు.



గొట్టుముక్కులలో నిమజ్జనానికి తరలుతున్న విగ్రహం



లింగంపేటలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు

భక్తిశ్రద్ధలతో గణనాధులకు వీడ్కోలు

దోమకొండ, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): దోమకొండ, బీబీపేట మండలాల్లో శుక్రవారం వినాయక విగ్రహాలను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. గణనాథులను యువజన సంఘాల సభ్యులు ప్రత్యేక వాహనాల్లో పెట్టి విద్యుత్ దీపాలతో అలంకరించి ప్రధాన వీధుల గుండా యువతీయువకుల నృత్యాల నడుమ ఊరేగింపు నిర్వహించి స్థానిక చెరువు, కుంటల్లో నిమజ్జనం చేశారు. ఎస్సైలు స్రవంతి, ప్రభాకర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

భిక్కనూరు: మండలకేంద్రంతో పాటుగా మండలంలోని ఆయాగ్రామాల్లో గణేష్ నిమజ్జనం కొనసాగుతుంది. వినాయకులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలల్లో పెట్టి పూజలు నిర్వహించిన అనంతరం ఆయాగ్రామాల్లోని ప్రధాన విధుల గుండా బ్యాండ్ చప్పుళ్ల నడుమ యువకుల నృత్యాలతో ఊరేగింపు నిర్వహించి స్థానిక చెరువు కుంటల్లో వినాయకులను నిమజ్జనం చేశారు. నిమజ్జనానికి సరైనా సౌకర్యాలు కల్పించలేదని పలు యువజన సంఘాల ప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. చాలా గణనాథులను మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామంలోని కుంటల నిమజ్జనం చేశారు.



వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న మండపాల నిర్వాహకులు

దోమకొండ(బీబీపేట): వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా శుక్రవారం శ్రీసిద్దిబుద్ధివినాయకుని శోభాయాత్రను వాసవి క్లబ్, ఆర్యవైశ్య మహిళల కోలాటాల నడుమ చప్పులతో నిర్వహించారు.

ఎల్లారెడ్డిరూరల్: మండల పరిధిలోని కళ్యాణీ, రత్నాపూర్. తిమ్మారెడ్డి గ్రామాలలో శుక్రవారం వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. మండపాల వద్ద వినాయకుని లడ్డూకు వేలం పాట నిర్వహించారు. అనంతరం యువకులు, భక్తులు గణనాథుల ముందు నృత్యాలు చేసుకుంటూ చెరువులు, వాగులు, జలాశాయాలకు బయలుదేరారు.

రామారెడ్డి: రామారెడ్డిమండల కేంద్రంలో గణపుల విగ్రహాల నిమజ్జనం ప్రశాంతంగా సాగింది. ఎస్సై లావణ్య ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు రెడ్డిపేట్, మద్దికుంట, అన్నారం, పోసానిపేట్, గిద్ద, ఉప్పల్వాయి, గొల్లపల్లి, ఇసన్నపల్లి, కన్నాపూర్ నిమజ్జన ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అలాగే మద్దికుంట గ్రామంలో నేతాజీ యువజన సంఘం సభ్యులు గణేష్ విగ్రహాన్ని బైక్‌పై వెళ్లి నిమజ్జనం చేశారు. డీజే లేకుండా భక్తిగీతాలు, కోలాటాలతో గణేష్ శోభయాత్రను కొనసాగించారు.

బాన్సువాడటౌన్: బాన్సువాడ పట్టణంలోని సరస్వతీనగర్‌లో చిన్నారులు గణేశ్ నిమజ్జనాన్ని భిన్న రీతిలో చేశారు. సైకిల్‌పై గణేశ్ శోభాయాత్ర నిర్వహించారు.

లింగంపేట: మండలకేంద్రంలో 9రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన వినాయకుడి విగ్రహాన్ని శుక్రవారం ఘనంగా నిమజ్జనం చేశారు. భజనలు, నృత్యాలు చేస్తూ వినాయకుని శోభాయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించారు.



విగ్రహాన్ని చెరువు వద్దకు తెచ్చిన దృశ్యం



వినాయక నిమజ్జనం చేస్తున్న యువకులు

అమర్లబండలో ఘనంగా దేవుని పండుగ



అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మండప నిర్వాహకులు

సదాశివనగర్, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమర్లబండ గ్రామంలో దేవుని పండుగను శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసం మొదటిరోజు శివాలయంలో స్వామివారి వద్ద శ్రావణ జ్యోతి వెలిగించి 41రోజులు నిరంతరం అభిషేకాలు, ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహిస్తారు. 41రోజులు పూర్తిఅయిన అనంతరం గ్రామస్థులందరూ కలిసి ఐక్యతతో ప్రతీయేడు దేవుని పండుగ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఉదయం స్వామివారికి జలాభిషేకాలు నిర్వహించి బిల్వ పూజ, కుంకుమ పూజ, అన్నపూజ తదితర కార్యక్రమాలు నిర్వహించి ఆంజనేయ స్వామి ఆలయం వద్దకు వెళ్లి స్వామివారికి సింధూరం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివాలయం వద్ద జెండా ఆవిష్కరణ కార్యక్రమం గ్రామస్థుల సమక్షంలో నిర్వహించారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించగా, రాత్రి స్వామివారికి పల్లకీ సేవ ఊరేగింపు నిర్వహించి, వివిధ గ్రామాల నుంచి వచ్చిన భజనమండలి సభ్యులు పెద్దఎత్తున భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భజన మండలి సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారీ గిరీష్ పంతులు, విశ్వనాథం పంతులు భక్తులకు తీర్థప్రసాదాలను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల

నిజాంసాగర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ ప్రాజెక్టు మూడు వరద గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువ ప్రాంతం నుంచి వరద తగ్గుముఖం పట్టడంతో నాలుగు గేట్లలో ఒక గేట్‌ను మూసి మూడు గేట్లను కొనసాగిస్తున్నారు. ఎగువ ప్రాంతం నుంచి 32,069 క్యూసెక్కుల వరద వస్తోంది. నిజాంసాగర్ ప్రాజెక్టు వీఆర్ నెంబర్ ఐదుని మూడు గేట్లు, పదిహేను వేల 849 క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేస్తున్నారు. 1500 క్యూసెక్కుల ప్రధాన కాలువల్లోనికి సాగర్ ప్రాజెక్టులో 17.802, టీఎంసీలకు గాను 16.762 నిల్వ చేస్తున్నారు.



ప్రాజెక్టు నుంచి విడుదల అవుతున్న నీరు

ముదిరాజ్‌లను బీసీ ఏ లోకి మార్చేందుకు ప్రభుత్వం కృషి

» రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధిక జనాభా కలిగిన ముదిరాజులను బీసీ డీ గ్రూపు నుంచి బీసీ ఏ గ్రూప్‌లోకి మార్చేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషిచేస్తుందని తీసుకుంటుందని రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రజ్ఞానేశ్వర్ అన్నారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా కామారెడ్డి జిల్లా జిల్లాముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో లిటిల్ స్కాలర్ స్కూల్‌లో ఏర్పాటుచేసిన ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలలో హామీ ఇచ్చిన విధంగా ముదిరాజులకు సరైన న్యాయం చేస్తామని తెలిపారు. ముదిరాజులు ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా కృషి చేయాలని అన్నారు. రాష్ట్ర ముదిరాజ్ సంఘం నాయకుడు పున్న రాజేశ్వర్ మాట్లాడుతూ ముదిరాజులు ఐక్యంగా ఉండి పోరాటాలకు సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గజ్జల భిక్షపతి మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయులకు రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ ద్వారా ప్రశంసా పత్రాలు అందజేయడం గర్వించదగ్గ విషయమన్నారు. త్వరలో జిల్లాలో అన్ని ముదిరాజు సంఘాలను ఒకే తాటిపైకి తెచ్చి భారీ సభ నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టుబార్ అసోసియేషన్ అధ్యక్షుడు నందరమేష్, రాష్ట్ర ముదిరాజ్ సంఘం నాయకులు నిజ్జన రమేష్, ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

వరసిద్ది వినాయక మండపం వద్ద అన్నదాన కార్యక్రమం

బాన్సువాడటౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో గల వరసిద్ది వినాయక మండపం వద్ద శుక్రవారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు వినాయకుడికి ప్రత్యేక పూజలు చేపట్టారు. మద్యాహ్నం ప్రాంగణంలో భక్తులు అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సంతోష్ , పాత రాజేశ్వర్ , సంగమేశ్వర్, వెంకన్న, రాజు, శ్రీనివాస్, నాగరాజు తదితరులున్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడిగా మోహన్‌రెడ్డి

బాన్సువాడటౌన్, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడిగా పి.మోహన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం బాన్సువాడ విశ్రాంత భవనంలో జరిగిన సమావేశంలో సభ్యులను నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా హన్మాండ్లు, కోశాధికారిగా కాశీరాం, ఉపాధ్యక్షులుగా దయానంద్, గంగాధర్ గౌడ్‌లతో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘ సభ్యులు తదితరులున్నారు.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70	-	ఘాటి
ప్రియ 35	-	మదరాసి
దర్శన్	-	బాగి-4

బాన్సువాడ

మహేశ్వరి	ఘాటీ
వెంకటేశ్వర	మదరాసి

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.150	రూ.170
స్కిన్	రూ.180	రూ.210
స్కిన్‌లెస్	రూ. 210	రూ.230



డ్రోన్ల ద్వారా పర్యవేక్షిస్తున్న పోలీసులు, అధికారులు

గంగమ్మ ఒడికి గణనాథులు

(5వ పేజీ తరువాయి)

తరలివచ్చారు. హైదరాబాద్‌లోని వినాయక శోభాయాత్ర మాదిరిగా కామారెడ్డిలో నిమజ్జన శోభాయాత్ర ప్రారంభమైంది. మండపాల నుంచి గణనాథులు కదిలేముందు లడ్డూవేలాలను నిర్వహించారు. భక్తులకు ఆయా దుకాణాల యజమానులు తమ దుకాణాల ఎదుట పులిహోర, సిరా, ఉప్మా తయారు చేసి పంపిణీ చేశారు.

డప్పు వాయిద్యాలు - యువకుల నృత్యాలు

కామారెడ్డిలో వినాయక నిమజ్జన శోభాయాత్రకు డప్పు వాయిద్యాలు, యువకుల నృత్యాలు పాటలకనుగుణంగా లేజర్ కిరణాల మధ్య భూమి కంపించే విధంగా రణగోణ ధ్వనులతో వివిధ బ్యాండ్లు, డప్పుల చప్పుళ్ల మధ్య గణేష్ శోభాయాత్ర ఉత్సహంగా కొనసాగింది. యువకుల కేరింతలు, నృత్యాల మధ్య గణనాథులకు ఘనంగా భక్తులు వీడ్కోలు తెలిపారు. కాగా శనివారం అర్ధరాత్రి వరకు కామారెడ్డి శివారులోని టేక్రియాల్ సమీపంలో గల అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువులో నిమజ్జనం చేయనున్నారు. కామారెడ్డిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన పలు భారీ విగ్రహాలను, మట్టి వినాయకులను పలు సంఘాల వారు, ఇళ్లలో నెలకొల్పిన విగ్రహాలను సైతం పలువురు శుక్రవారం నిమజ్జనం చేశారు.

నిమజ్జనానికి భారీ బందోబస్తు

కామారెడ్డిలో వినాయక శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్పీ రాజేష్‌చంద్ర ఆధ్వర్యంలో ఏఎస్పీ చైతన్యరెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు మొత్తం 300 మంది పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించనున్నారు. ఇక వీరితోపాటు స్పెషల్‌పార్టీ పోలీసులు, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు బందోబస్తులో సేవలు అందించనున్నారు. 120 సీసీకెమెరాలు, 2డ్రోన్ కెమరాలను ఏర్పాటుచేశారు. ట్రాఫిక్ సమస్య లేకుండా, పట్టణంలో భారీ వాహనాలు తిరగకుండా భారీ కేడ్‌లను భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లుచేశారు. గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సిరిసిల్లా రోడ్డులోని ఇందిరాచౌక్ వద్ద ఏర్పాటు చేసిన వేదికపై పట్టణ ప్రముఖులు గణనాథులకు స్వాగతం పలికారు. గణేష్ వేడుకల ఔన్నత్యాన్ని చాటి చెప్పారు. భక్తుల సందడితో కామారెడ్డి వీధులన్ని కళకళలాడాయి. చెరువు వద్ద బారికేడ్లు, క్రేన్‌తో పాటు గజ ఈతగాళ్లు, లైటింగ్‌ను మున్సిపల్ అధికారులు ఏర్పాటుచేశారు. గణేష్ మండపాల నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చెరువు వద్ద కంట్రోల్ రూం ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమాచారం అందించారు.

తాత్కాలికంగా ట్రాఫిక్ మళ్లింపు

జిల్లాకేంద్రంలో గణేష్ నిమజ్జనం సందర్భంగా కరీంనగర్, సిరిసిల్ల వైపు నుంచి కామారెడ్డిలోకి రాకపోకలు సాగించే వాహనాలు సిరిసిల్లరోడ్డు నుంచి టెక్రియాల్ వైపు, టెక్రియాల్ నుంచి సిరిసిల్ల రోడ్డువైపు రూట్ మార్చారు. కొత్తబస్టాండ్ నుంచి పాత బస్టాండ్‌వైపు వెళ్లే వాహనాలు కొత్తబస్టాండ్ నుంచి అశోక్‌నగర్, రైల్వేగేట్ వరకు వచ్చి అక్కడి నుంచి కలెక్టర్ ఆఫీస్ నుంచి గుమస్తాకాలనీ, రామారెడ్డివైపు, ఓంశాంతిభవనం నుంచి రాజీవ్‌నగర్, టీచర్స్‌కాలనీ, ఇంద్రనగర్‌కాలనీ వెళ్లేలా రూట్‌మార్చారు. హైదరాబాద్‌వైపు వెళ్లే వాహనాలు యథావిధిగా పాతమార్గం ద్వారా వెళ్లేఆ చర్యలు తీసుకున్నారు. హైదరాబాద్‌వైపు నుంచి పాతరాజంపేటవైపు నుంచి కామారెడ్డి పట్టణంలోకి ప్రవేశించే వాహనాలు టెక్రియాల్ బైపాస్ నుంచి ఇందిరాగాంధీ స్టేడియం ముందుగా బస్టాండ్‌చేరుకుని పట్టణంలోకి ప్రవేశించవచ్చని ఎస్పీ తెలిపారు.

వైభవంగా శ్రీవారి కల్యాణ మహోత్సవం

బీర్కూర్, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ శివారులోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో శ్రవణ నక్షత్రం సందర్భంగా శుక్రవారం శ్రీవారి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా సాగింది. పలు జంటలు కల్యాణ మహోత్సవంలో పాల్గొని కల్యాణ జరిపించారు. స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య శ్రీవారి కల్యాణ వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ సన్నిధిలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అప్పారావు, నరసరాజు, సత్యనారాయణ, మురళీ, భక్తులు, పాల్గొన్నారు.

ఆకుపై సర్వేపల్లి ముఖచిత్రం

మద్నూర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మద్నూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిత్రకారుని ప్రతిభ చూసి ప్రజలు అభినందిస్తున్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రతీ ఏడాది ఉపాధ్యాయ దినోత్సవ జరుపుకుంటారు. అందులో భాగంగా తన వంతుగా గురువులకు బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు బాదం ఆకుపై సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటాన్ని గీసి తన కళా నైపుణ్యాన్ని సృష్టించారు. ఉపాధ్యాయులు చిత్రపటం గీసిన బాల కిషన్‌ను అభినందిస్తున్నారు.



బాదం ఆకుపై వేసిన చిత్రం



సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న దృశ్యం

ఉత్తమ ప్రిన్సిపాల్‌గా తారాసింగ్

లింగంపేట, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒంటర్‌పల్లికి చెందిన తారాసింగ్ రాష్ట్ర ఉత్తమ ప్రిన్సిపాల్‌గా తారాసింగ్ ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలో భాగంగా శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా తారాసింగ్ అవార్డును అందుకున్నారు. తారాసింగ్ మెదక్ జిల్లాలో గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలని ఫిర్యాదు

బాన్సువాడ రూరల్, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహం చూపుడు వేలును ధ్వసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ శుక్రవారం మాలమహానాడు కమిటీ సభ్యులు పట్టణ సీఐ మండల అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు బంగారు మైసయ్య, ప్రశాంత్, మల్లూరు సాయిలు, మన్నె చిన్నసాయిలు, చెట్లూర్ సాయిలు పాల్గొన్నారు.



చర్యలు తీసుకోవాలని సీఐకి ఫిర్యాదు చేస్తున్న గ్రామస్థులు